# సమీర

చలపతి హుషారుగా ఆఫీసులోంచి బయటపడ్డాడు. అప్రయత్నంగా అతని చేతులు అతని ప్యాంట్ జేబులోకి వెళ్లిపోయాయి. నోట్లోంచి సన్నగా విజిల్ వచ్చింది.

"హలో పతిగారూ! ఏంటంత జోరుగా ఉన్నారు?" ధీరజ పలకరించింది అతనికి ఎదురుపడి.

ధీరజ అతని కొలీగ్, ఆమెకి పెళ్లికాలేదు. చేసుకో లేదని కొందరంటారు. చేసుకోదని మరికొందరు చెబుతారు.

"సస్పెన్స్! తరువాత చెబుతాను. అదేంటి మీరింకా బస్సు కోసం ఎదురు చూస్తున్నారు!"

"ఆ! ఆటోలో పోవాల్సిందే – లేటవుతోంది."

"ఓకే! నేను మిమ్మల్ని సగం దూరం వదలిపెడతాను. నా ఆటోలో ఎక్కండి". చలపతి ఆఫర్ చేశాడు.

ధీరజ ఆనందంగా అంగీకరించి ఆటోలో అతని పక్కన కూర్చుంది. ఆటో బయలు దేరింది.

ధీరజ సెంటు అతని ముక్కుపుటాలను సోకుతోంది. కుదుపులకు ఆమె అతని మీద వాలుతోంది. కానీ – ఇవన్నీ అతని ఆలోచనల్ని చెదరగొట్టడం లేదు.

చలపతి జీవితంలో ఒక అతి ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాడు. అదీ ఇన్నాళ్టికి... పది సంవత్సరాల నిరీక్షణ తరువాత తను తీసుకున్న నిర్ణయం!

తను సమీరను పెళ్లి చేసుకోబోతున్నాడు. సమీరను తలుచుకోగానే అతని ఒళ్లు పులకరించింది.

ముద్ద మందారంలా సిగ్గుల మొగ్గయి కుర్చీలో ఒదిగి కూర్చున్న సమీర గుర్తుకొచ్చింది, పసుపు పచ్చటి పట్టుచీరలో... పసిమి వన్నెల చిలకలా సమీర గువ్వలా ఒదిగి చిరునవ్వులు ఒలకబోసింది.

సమీర గవర్నమెంటు ఉద్యోగం చేస్తోంది. జీతం పర్వాలేదు. చలపతి ఓ మంచి కంపెనీలో పనిచేస్తున్నాడు. జీతం బాగానే ఉంది.

కానీ అతనికి ఉద్యోగం చేసే అమ్మాయినే పెళ్లిచేసుకోవాలని కోరిక! దానికోసం ఎన్నో సంబంధాలు తిరగ్గొట్టాడు. అమ్మాయి బావుంటే – ఉద్యోగం ఉండేది కాదు.

ఉద్యోగం బావుంటే – అమ్మాయి బావుండేది కాదు.

అన్నీ బావుంటే వాళ్లిచ్చే కట్నం బావుండేది కాదు.

అదే బావున్నా – జాతకాలు – వంశ మర్యాదలు అడ్డు తగిలేవి.

అలా–అలా రాజీపడలేక... వందలకొద్దీ సంబంధాలు చూస్తూ చూస్తూ ... పెళ్లి చూపులు అతని హాబీ అని నలుగురూ చెవులు కొరుక్కునే స్థితికి చేరుకున్నాడు.

'పెళ్లి చేసుకోనని ధైర్యంగా చెప్పచ్చుగా! ఇలా అందరి ప్రాణాలు తీసే బదులు'. అని చాటుగా విసుక్కునే దశకు చేరుకున్నాడు.

అటువంటిది – అప్సరసలా సమీర అతనికి దొరికింది.

పెళ్లి చూపుల్లోనే ఫ్లాట్‌గా పడిపోయాడు. అసలు ఇటువంటి సౌందర్య రాశి ఇన్నాళ్లు పెళ్లికాకుండా ఎలా ఉందని ఆశ్చర్యపోయాడు.

"బాబూ! అమ్మాయి మంచి ఉద్యోగమే చేస్తోంది. కానీ పెళ్లయిన తరువాత ఉద్యోగం

మానమంటే మానదు." ఆమె తండ్రి ఆనందరావు చెప్పాడు.

సమీర ఒకసారి కళ్లెత్తి తండ్రి వంక చూసి ఆత్రంగా చలపతి వంక చూసింది.

"అబ్బే! నేను పొరపాటున కూడా ఉద్యోగం మానమని చెప్పను. ఐ లైకిట్!" చెప్పాడు చలపతి.

నిట్టూర్చింది సమీర.

"అబ్బాయ్! అమ్మాయి ఒక్కటే కూతురు కావడంతో కాస్త గారాబంగా పెంచాము. వంటా వార్పు సరిగా రావు. నువు కొంచెం సర్దుకు పోవాలి." తల్లి శాంతమ్మ చెప్పింది.

సమీర కించిత్తు కోపంగా ఆమె వంక చూసింది. చలపతి రియాక్షన్ కోసం చెవులప్పగించింది.

"అయ్యో! దాందేముంది! ఈ కాలం వంట బ్రహ్మ విద్యా! కుక్కరు పడేస్తే అదే ఉడుకుతుంది. అంతగా అయితే నేను నేర్పిస్తానులెండి." తీరిగ్గా అన్నాడు చలపతి.

"మా అమ్మాయికి మేమంటే పంచప్రాణాలు. మా మీద ఎప్పుడు గాలి మళ్లితే అప్పుడు మాయింటికొచ్చేస్తుంది. అటువంటి వాటికి నువ్వేమీ అడ్డు పడకూడదు." తండ్రి చెప్పాడు.

"అంతే లెండి... కన్నవాళ్ల మీద ఎవరికుండదు ప్రేమ!" చలపతి మెచ్చుకున్నాడు.

"గారాబం ఎక్కువ కావడంతో కనిపించినవన్నీ కొంటూ ఉంటుంది. కొంచె ఖర్చుదారీ మనిషి! పీనాసితనం చూపితే ఆమెకు కోపం వస్తుంది." తల్లి చెప్పింది.

"ఐసీ...! సంసారం ఏర్పడ్డ తరువాత సర్దుకుంటారు."

"సారీ! మా అమ్మావాళ్లు ఏవేవో చెప్పి మిమ్మల్ని విసిగిస్తున్నట్టున్నారు. మా వాళ్ళు పూర్వ కాలం మనుషులు. తెల్లనివన్నీ పాలు - నల్లనివన్నీ నీళ్లు అనుకునే వాళ్లు! ఏదీ దాచకూడదని వాళ్ల ఉద్దేశం!" సమీర ధైర్యంచేసి మాట్లాడింది- ఉండబట్టలేక!

"అఫ్‌కోర్స్! అలా ఉంటేనే మంచిది. ఐ యామ్ హ్యాపీ!" చెప్పాడు చలపతి.

అతను ఎందుకు సంతోషపడ్డాడో సమీరకు సరిగా అర్థం కాలేదు.

"బాబూ! అమ్మాయి గురించి తరువాత కబురు చేద్దామా, ఆలోచించుకుని." పెళ్లిళ్ల పేరయ్యలా వ్యవహరిస్తున్న మారుతీరావు అడిగాడు.

"తొందరేం లేదు. బాగా ఆలోచించుకుని చెప్పండి." ఆనందరావు గంభీరంగా అన్నాడు.

"జీవితం నూరేళ్ల పంట! తొందర పడితే ఎలా? ఆ మాత్రం టైం తీసుకోవాలిగా - నిదానంగా ఆలోచించుకుని రాయండి." శాంతమ్మ చెప్పింది.

సమీర తలెత్తి అతని కళ్లల్లోకి చూసింది.

కరెంట్ అతని నరనరాల్లో ప్రవహించింది. ఇక ఉండబట్టలేక పోయాడు.

"ఇందులో ఆలోచించుకోవాల్సిందేముంది. అమ్మాయి నాకు నచ్చింది." మెలికలు తిరిగి పోయ డు.

సమీర నేత్రాలలో ఆనందం అమృతంలా కురిసింది. ఆమె తల్లిదండ్రులు ఉక్కిరి బిక్కిరి అయిపోయారు. కాసేపట్లో తేరుకున్నారు.

"అయ్యో! మారుతీరావు గారూ! అమ్మాయికి కట్నం ఇవ్వమన్న సంగతి చెప్పారా అబ్బాయికి!" ఆనందరావు అన్నాడు కుండబద్దలు కొట్టినట్టు.

"ఎందుకు చెప్పి ఉండరు - అందుకు ఒప్పుకునే కదా. పెళ్లి చూపులకొచ్చింది." శాంతమ్మ సమర్థించింది.

మారుతీరావు నీళ్లు నమిలాడు.

చలపతి నెత్తిమీద పిడుగు పడినట్లయింది.

"ఆ సంగతి తమరు నాకు చెప్పినట్లు గుర్తులేదు." మారుతీరావు అన్నాడు - తడబడుతూ.

"అదేంటి? అంత ముఖ్యమైన సంగతి ఎలా మర్చిపోయారు?" ఆశ్చర్యపోయాడు ఆనందరావు.

"అబ్బాయి బుద్ధిమంతుడు - ఒప్పుకుంటాడు వెధవ కట్నందేముంది. కుందనపు బొమ్మలాంటి అమ్మాయి లక్ష్మిలా ఇంటికొస్తుంటే!" శాంతమ్మ చెప్పింది.

సమీర గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. చలపతి నిర్ణయం కోసం ఆమె తన ఊపిరి బిగపట్టింది.

"ఆ! నాకు కొంచెం టైం కావాలి. మా వాళ్లతో మాట్లాడాలి... నాకూ పెళ్లికాని చెల్లెలుంది... వాళ్ల అభిప్రాయం తెలుసుకుని రాస్తాను." చలపతి దిగులుగా చెప్పాడు.

సమీర జావకారి పోయింది. ఎందుకో ఆమె మనసు కీడు శంకిస్తోంది.

"అంతే! పెళ్లన్న తరువాత చాలా ఆలోచించుకోవాలి. మీ చెల్లెలుకు కట్నం ఎలా తేవాలి - మీ వాళ్లు ఒప్పుకుంటారో లేదో ... ఇవన్నీ ఆలోచించుకుని బాగా టైం తీసుకుని ఓ నిర్ణయానికొచ్చి తెలియచెయ్యి." ఆనందరావు చెప్పాడు విసురుగా.

"అంత్య నిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలు." శాంతమ్మ తల్లి మెటికలు విరిచింది.

అప్పటినుంచి చలపతి దాదాపు నెల రోజులు పాయసంలో పడ్డ ఈగలాగా కొట్టుకున్నాడు.

రాత్రింబగళ్ళు సమీరే కనిపిస్తోంది- తన అమాయకపు నేత్రాలతో అతణ్ణి వేడుకుంటూ....

ఎన్నో ఏళ్లుగా కట్నం మీదపెంచుకున్న ఆశలు అతణ్ణి వెక్కిరిస్తున్నాయి... ఇంట్లో తల్లిదండ్రులు ముందు వద్దన్నా - తరువాత మనసు మార్చుకున్నారు, ఈ బడుద్ధాయికి పెళ్లయితే చాలని.

చలపతి తాను అనుకున్నది సాధించేదాకా నిద్ర పోవడం ఎరుగడు. అందుకే పెళ్లి కోసం ఇన్నాళ్లు ఆగాల్సి వచ్చింది. తీరా అమ్మాయి నచ్చేసరికి ఇలా అయిపోయింది.

చివరికి జుట్టు పీక్కుని... గోళ్లు కొరికి.. పిచ్చివాడిలా వీధులన్నీ చుట్టిచుట్టీ... రాత్రిళ్లు మేల్కొనీ మేల్కొనీ... టీలు తాగి తాగీ - కాగితం మీద పిచ్చిరాతలు రాసీరాసీ... ఓ నిర్ణయం తీసుకున్నాడు.

కానీ కట్నం తీసుకురాక పోయినా ఫర్వాలేదు. సమీరను తను పెళ్లి చేసుకోవాలి!

ధీరజ అతని భుజం మీద తట్టి దార్లో దిగిపోయింది - అది కూడా అంత పట్టించుకోలేదు.

ఆటో దిగి ఆ.యింట్లోకి అడుగుపెడుతుంటే అతని గుండెలు గుబగుబ లాడాయి. కళ్లు ఆత్రంగా పరుగులు తీశాయి.

తీసి ఉన్న తలుపుల్లోంచి లోపలికి వచ్చేశాడు. వాలుకుర్చీలో పడుకున్న ఆనందరావుగారు ఉలిక్కి పడ్డారు. లేచి కూర్చుని ఎగాదిగా చూశారు.

"నేనండీ... చలపతిని... మీ అమ్మాయిని చూశాను." గుటకలు మింగాడు.

"ఓ! నువ్వటోయ్! రా! కూర్చో! ఉత్తరం వస్తుందని ఎదురు చూస్తూ ఉంటే - ఉత్త చేతులతో నువ్వే వచ్చేశావ్. కూర్చో బాబూ! ఒసేయ్! శాంతా! ఇలారా! ఎవరొచ్చారో చూడు!" కేకపెట్టాడు లోపలికి.

చేతులు తుడుచుకుంటూ శాంతమ్మ బయటకొచ్చింది.

"ఏం బాబూ! ఓ కార్డుముక్క రాస్తే సరిపోయేదిగా నచ్చలేదని. పనిగట్టుకుని ఇంత దూరం

వచ్చి చెప్పాలా!" దీర్ఘాలు తీసింది శాంతమ్మ.

బిక్కచచ్చి పోయాడు చలపతి.

"మీ అమ్మాయి లేదా?" 'ఏం చెప్పాలో తెలీక అడిగాడు.

"అదా... అప్పుడే వస్తుందా - ఏడవుతుంది వచ్చేసరికి!" చెప్పాడు ఆనందరావు.

"ఆఫీసు ఐదుకే అయిపోతుంది కదాని వచ్చాను...."

"అందరికీ అయిదుకే అయిపోతుందేమో దీనికి మాత్రం కాదు - ఎందుకే అంత ఆలశ్యం అంటే పని ఎక్కువైందంటుంది". శాంతమ్మ చెప్పింది.

"పోనీలెండి - వెయిట్ చేస్తాను". చెప్పాడు.

"బాబూ! టిఫిన్ తీసుకురమ్మంటావా?" శాంతమ్మ అడిగింది.

"వద్దులెండి. గతికితే అతకదంటారు..." సిగ్గుపడుతూ చెప్పాడు.

"అంటే... నీ ఉద్దేశ్యం?" ఆనందరావు అడిగాడు.

"మీ అమ్మాయి నాకు బాగా నచ్చింది. వెంటనే ముహుర్తాలు పెట్టించండి..." సిగ్గుపడుతూ తలవొంచుకున్నాడు.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం రాజ్యమేలింది.

'కొంపదీసి తన నిర్ణయానికి ముసలాళ్లు షాక్ తిని పైకి పోయారా?' అనిపించింది. తల పైకెత్తి చూశాడు - వాళ్లిద్దరూ కన్నీళ్లు తుడుచుకుంటున్నారు.

ఎంతైనా మమకారం! జాలి వేసింది.

"ఊరుకోండి. మీ అమ్మాయి నా దగ్గరున్నా మీ దగ్గరున్నట్లే! ఎప్పుడు పడితే అప్పుడు వస్తుంది". చెప్పాడు.

శాంతమ్మ భోరున ఏడ్చింది.

బిత్తరపోయాడు!

"బాబూ! నీలాంటి మంచివాడికి నిజం దాచ బుద్ధి కావడం లేదు". ఆనందరావు చెప్పాడు.

"ఏంటా నిజం?!" చలపతి ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎలా చెప్పమంటావు బాబూ! అటు చూస్తే కన్న కూతురు, ఇటు చూస్తే దేవుడి లాంటి కాబోయే అల్లుడు". శాంతమ్మ కన్నీళ్లు తుడుచుకుంది.

"ఫర్వాలేదు - చెప్పండి". బితుకు బితుకుమంటూ అడిగాడు.

"అతి గారాబం వల్ల మా అమ్మాయికి కొంచెం తిరుగుళ్లు అలవాటయ్యాయి". ఆనందరావు చెప్పాడు.

"అంటే... సినిమాలు, షికార్లు...!" అన్నాడు చలపతి.

"ఆ! అవే... కాకపోతే కొంచెం ఫ్రెండ్స్ సర్కిల్ ఎక్కువ. బాయ్ ఫ్రెండ్స్ అంటే మరీ ఇష్టం దానికి. ఎంత చెప్పినా వినకుండా వాళ్లతో బాగా తిరుగుతూ ఉంటుంది." ఆనందరావు కోపంగా చెప్పాడు.

"గతి లేక మేము దానిమీద ఆధారపడ్డాం కాబట్టి దానికి ఎదురు చెప్పలేక పోతున్నాం!" శాంతమ్మ.

చలపతి కొంచెం షాక్ తిన్నాడు. అయినా తేరుకున్నాడు.

"ఫర్వాలేదు లెండి. ఈ కాలం ఆడపిల్లలు సోషల్‌గా ఉంటారు. అందరితో మాట్లాడుతూ

ఉంటారు. ఉద్యోగ ధర్మంలో గిరిగీసుకుని కూర్చుంటే పనులు కావు.'' సమర్థించాడు.

''అదైతే ఫర్వాలేదు బాబూ! అది అడపాదడపా కాలుజారడం, మేము నానా తిప్పలు పడటం... మాకు చచ్చే చావవుతోంది. పెళ్లిముందు జరిగిందేదో జరిగింది... అవన్నీ ఫర్వాలేదు - పెళ్లయిం తరువాతన్నా నిన్నే నమ్ముకుని ఉంటే బావుంటుంది''. శాంతమ్మ చెప్పింది.

సీలింగ్ ఫ్యాన్ ఊడి తన నెత్తిమీద పడినట్లు గిలగిల కొట్టుకున్నాడు చలపతి.

''ఛీఛీ! ఈ ఆడోళ్ల నోట నువ్వు గింజ నానదు బాబూ! అవన్నీ ఏం పట్టించుకోవద్దు. నేనే మంచిరోజు చూసి కబురు చేస్తాను. అప్పటి దాకా ఆగు''. ఆనందరావు చెప్పాడు.

చలపతి షాక్ అయి తల అడ్డంగా ఊపి బయట పడ్డాడు.

చలపతి జుట్టు పెంచేశాడు - గెడ్డం పెంచేశాడు. సిగరెట్లు విపరీతంగా కాలుస్తున్నాడు. శూన్యంలోకి పిచ్చి చూపులు చూస్తున్నాడు. ఉన్నట్లుండి తనలో తానే నవ్వుకుంటున్నాడు.

అతని కొలీగ్స్ అంతా ఆశ్చర్యపోతున్నారు. వంకర కామెంట్లు చేస్తున్నారు. అవన్నీ వినే దశ దాటిపోయాడు.

ధీరజ ఒకరోజు అతణ్ణి ఓ ఖరీదైన హోటల్‌కు లాక్కొచ్చింది బలవంతంగా. డిన్నరు ఆర్డరిచ్చింది.

''చలపతీ! ఏంటి నీ సమస్య!'' సూటిగా అడిగింది.

పల్లికిలించాడు. మాట్లాడలేదు.

''యూ ఫూల్! ఏంటి నీ బాధ? - నాతో చెప్పకూడదా?''

''ఈ బాధ ఒకళ్లతో చెప్పుకునేది కాదు - తీర్చేదిగాదు.'' గాల్లోకి పొగ వదులుతూ చెప్పాడు.

''పంచుకుంటే పెరిగేది ఆనందం - తరిగేది బాధ! నీ పర్సనలే! కాదనను. కానీ, ఎందుకిలా పిచ్చివాడివై పోయావో లోకానికి కాకపోయినా కనీసం నీ మీద ఆశలు పెట్టుకున్న నాకన్నా తెలియాలి కదా!'' లాలనగా అతని భుజం మీద చేయివేసింది.

చలపతికి దుఃఖం కట్టలు తెంచుకుంది. ఏడ్చేశాడు.

ఆమె అతణ్ణి బుజ్జగించింది. లాలించింది.

ఇంక అతను తట్టుకోలేక తన మనసులోని బాధ పూసగుచ్చినట్లు చెప్పాడు. చెప్పి ఏడ్చేశాడు. ఏడుస్తూ చెప్పాడు. చెప్పి తల బాదుకున్నాడు.

అంతా విని ధీరజ పకపకా నవ్వింది.

చలపతి ఖంగుతిన్నాడు.

''నీకంత నవ్వులాటగా ఉందా నా చరిత్ర!''

''చలపతి! నువ్వొట్టి వాజమ్మవి!'' నవ్వింది.

''ఎందుకు?'' కోపంగా అడిగాడు.

''సమీర నీకు నచ్చింది కదూ! నువ్వు చాలా లైక్ చేస్తున్నావు కదూ! ఇంకేం! వెంటనే వెళ్లి ఆమె మెళ్లో తాళి కట్టెయ్యి!'' ఏడుస్తూ పలికింది ధీరజ.

''అరే! ధీరజా, నా సమస్య నీకు అర్థం కాలేదా? ఆమె క్యారెక్టర్...?''

''పాతచింతకాయ పచ్చడి కాదూ! ఈ కాలంలో క్యారెక్టర్ ఎవరు చూస్తున్నారు? కావాల్సింది అందం, ఆస్తి! కొన్నాళ్లకు మీ పాతచింతకాయ పచ్చడి భావాలు శీలం- గాడిద గుడ్డు డిక్షనరీలో కనపడవు. యూ ఫూల్! గో అండ్ మ్యారీ హర్!'' చాలా తేలిగ్గా చెప్పింది.

"ఐ యామ్ సారీ! జీవితాంతం ఆమెను ఆరాధిస్తూ బ్రహ్మచారిగా ఉండిపోతాను కానీ - ఆమెను పెళ్లిచేసుకోలేను." చలపతి బాధ పడుతూ చెప్పాడు.

ధీరజ ఉన్నట్లుండి అతణ్ణి ముద్దు పెట్టుకుంది. ఏడ్చింది. కన్నీళ్లు తుడుచుకుంది.

చలపతి బిత్తరపోయి చూస్తున్నాడు.

"జస్ట్ జోక్ చేశాను అంతే! నీ సమీర ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం! నువ్వు పోయి పెళ్లి చేసుకో నీకే తెలుస్తుంది." ధీరజ బిల్లు చెల్లించి అతని జవాబు కోసం ఎదురు చూడకుండా వెళ్లిపోయింది.

చలపతి టైం చూసుకున్నాడు. ఇంకా మూడు కాలేదు. ధీరజ మాటలు అతనికి కొండంత ధైర్యమిచ్చాయి.

ఆటో వేసుకుని నేరుగా సమీర ఆఫీసుకొచ్చాడు. వాళ్లనీ వీళ్లని అడుగుతూ సమీర సీటు కనుక్కున్నాడు.

సీతమ్మ వారు అశోక వనంలో రామనామ స్మరణ చేస్తున్నట్లు - పదిమంది మగవాళ్ల మధ్యలో సమీర తలవొంచుకుని ఫైళ్లు ముందేసుకుని తదేక దీక్షతో పని చేసుకుంటోంది.

ఆమె ముందు నిల్చుని దగ్గాడు.

ఆమె తలెత్తి చూసింది. ఒక్క క్షణం పోల్చుకోలేకపోయింది. వెంటనే ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి.

హెడ్డుతో ఏదో చెప్పి అతని వెంట బయటికొచ్చింది, చెట్ల కిందకు ఆఫీసుకు దూరంగా తీసుకుపోయింది.

"ఎందుకొచ్చారు?" తల వంచుకుని అడిగింది.

"నీ కోసం!" ఆర్తిగా అన్నాడు.

"నీ కోసం" అని వినగానే ఆమె హృదయ వీణను శృతి చేసినట్లయింది. గుండెల్లోంచి ఆనందం, దుఃఖం పొంగుకొచ్చాయి.

తన తల్లిదండ్రులకున్న ఒకే ఒక బాధ తనకు పెళ్లి కాలేదని, అదేం ఖర్మో! ఎన్నో సంబంధాలు వచ్చాయి. దాదాపు అందరికీ తను నచ్చింది. తీరా తాంబూలాలు పుచ్చుకునే సమయానికి ఎందుకో కథ అడ్డం తిరిగేది!

చేసుకుంటానన్న పెళ్లి కొడుకు కనిపించే వాడు కాదు. ఆ సంబంధం వాళ్ల నుంచి ఎటువంటి సమాచారం అందేదీ కాదు, ఈ దిగులుతోనే తన తల్లిదండ్రులు దాదాపు మంచం పట్టారు. సంఘంలో తలెత్తుకు తిరగలేక పోతున్నారు.

వాళ్లను తలుచుకుంటే తనకు జాలి కలుగుతుంది. తనేం ఒంటరిగా పుట్టలేదు. తనతోటి ఇంకా నలుగురు అన్నలు పుట్టారు దున్నపోతుల్లా!

తన తండ్రికేమీ స్థిరాదాయం కానీ, ఆస్తిపాస్తులు కానీ లేవు. కేవలం రెక్కల కష్టం - చిన్నా చితకా వ్యాపారం చేసి అందరినీ చదివించి పెద్ద చేశాడు. దేవుని దయవల్ల అన్నలందరికీ ఉద్యోగాలు వచ్చాయి - తన తండ్రి దివాళా తీసే సరికి.

గంపెడాశతో పెళ్లిళ్లు చేస్తే కానిదానికీ, అయిన దానికీ గొడవపడి వదినలు అన్నలను తమనుంచి దూరం చేసేశారు. అయినా మన బంగారం మంచిదై ఉండాలిగా!

వృద్ధాప్యంలో తోడూనీడా లేక ఒంటరిగా మిగిలి పోవాల్సి వచ్చింది తనవాళ్లు. అందుకే తను

పెళ్లి చేసుకోకుండా వాళ్లకు తోడుగా ఉందామనుకొంటే వాళ్లు ఒప్పుకోలేదు. ''అమ్మా! సమీరా! ఈ లోకం సంగతి నీకు తెలీదమ్మా! మేము ఏమైనా ఫర్వాలేదు. నిన్నొక అయ్య చేతిలో పెడితే మా బాధ్యత తీరిపోతుంది'' నాన్న అనేవాడు - కన్నీళ్లు తుడుచుకుంటూ.

చలపతి వచ్చి రెండు నెలలైనా ఏం జవాబు రాకపోయే సరికి ఇదీ పోయిందనుకుంది.

"హు! రెండు నెలలు పట్టిందా మీ నిర్ణయం తెలుపడానికి!" నిష్ఠూరంగా అంది. "మా అమ్మానాన్నలు నాకు పెళ్లి కాదని బెంగ పెట్టుకున్నారు. చివరికి మీరు కూడా ఏమీ పలక్కపోయే సరికి చిక్కి సగమై పోయారు." బాధగా చెప్పింది.

"అంటే... నేను ఒక నెల కిందట మీ యింటికొచ్చిన సంగతి నీకు తెలీదా?" తేరుకుని అడిగాడు.

ఆమె ఆశ్చర్యంగా చూసింది. ఆమె కన్నుల్లో అపనమ్మకం!

చలపతి తట్టుకోలేక ఆమెను వాటేసుకున్నాడు.

"మై స్వీట్ డార్లింగ్! నువ్వు నాకు కావాలి. మీ వాళ్ల బెంగ నీ పెళ్లి గురించే కదా! పద! గుళ్లో పెళ్లి చేసుకుని ఇంటికి పోదాం. మీ వాళ్లు స్టన్ అయిపోవాలి." ఆమెని తనివితీరా ముద్దుపెట్టుకుంటూ అన్నాడు.

ఆమె తత్తర చూపులతో తమని ఎవరూ చూడటం లేదు కదా అని సిగ్గు పడింది. అదృష్టం కొద్దీ చెట్ల చాటున ఉన్నారు.

"అబ్బా! ఏంటీ తొందర - రాత్రికే శోభనం చేసుకునే లాగున్నారు - దేనికైనా ముహూర్తం కావాలిగా!" గోముగా అంది.

"ప్లీజ్! ఇంకేం మాట్లాడొద్దు. పద గుడి కెళ్దాం." బలవంతంగా లాక్కుపోయాడు ఆమెకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా.

సమీర ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయింది తన తల్లిదండ్రులకు బరువు తగ్గుతుందనుకుంది. కాస్త ఖర్చు అయినా మిగులుతుందనుకుంది. ఏదైనా తన వాళ్లను సర్‌ప్రైజ్ చేద్దామనుకుని ఒప్పుకుంది.

మెళ్లో దండలతో ఆటో దిగిన కూతుర్ని - అల్లుణ్ణి చూసి ఆనందరావు, శాంతమ్మలు అవాక్కయిపోయారు.

గబుక్కున అల్లుడి కాళ్ల మీద పడిపోయాడు ఆనందరావు.

"చూడండి. మీరేం భయపడక్కరలేదు. మీ జీవనాధారానికేం లోటు లేదు. మీ కూతురు మిమ్మల్ని వదిలిపోదు. నేను ఈ ఇంట్లోనే ఉంటాను. బతికినంత కాలం మీకే లోటూ ఉండదు". చెప్పాడు.

"మమ్మల్ని క్షమించు బాబూ!" శాంతమ్మ చేతులు పట్టుకుంది.

ఈ క్షణంలో సమీరకు జరిగిందీ ఇపుడు కనిపిస్తున్నవీ అర్థం కాలేదు. కళ్లప్పగించి చూస్తోంది - అందరి వేపూ...!

★

(ఆంధ్రజ్యోతి-------వారపత్రిక)

